క్లుప్తంగా

ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు



విద్యార్థులతో ముచ్చటిస్తున్న డిప్యూటీ ఈఓ తిరుమలచైతన్య

బూర్జ: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చునని డిప్యూటీ ఈఓ తిరుమలచైతన్య అన్నారు. మండలంలో గల అప్పలపట్నాయికోపేట పంచాయతీలో కె.కె,రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం పరిశీలించారు. విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యా ప్రమాణాలు పరిశీలించారు. హెచ్ఎం వై.మాలతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

మొక్కలతో మానవ మనుగడ



కొబ్బరి మొక్కలు నాటుతున్న నాయకులు

బూర్జ: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యపడుతుందని తమ్మినాయుడుపేట సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు మూడడ్ల సత్యనారాయణ అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా అందజేసిన కొబ్బరి మొక్కలు గురువారం గ్రామ చెరువు గట్టుపై నాటారు. మొక్కలు నాటడమే కాకుండా సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌బీమా తక్షణసాయం అందజేత



వైఎస్సార్ బీమా అందజేస్తున్న తవిటినాయుడు

సరుబుజ్జిలి: మండలంలోని మూలసవలాపురం గ్రామానికి చెందిన సిరిపల్లి యర్రయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుని తల్లి సిరిపల్లి కాంతమ్మకు వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద రూ.10వేలను వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత పున్నపురెడ్డి తవిటినాయుడు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు సిరిపల్లి శ్రీనివాసరావు, అరవల భాస్కరరావు, గొల్లపల్లి మోహనరావు, గణేష్, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా వారోత్సవాలు



గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

పొందూరు: మండలంలోని గూనానపేట ప్రాథమిక పాఠశాలలో తెలుగు భాషా వారోత్సవాలను హెచ్ఎం గురుగుబెల్లి మధుబాబు ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గిడుగు జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. తెలుగు భాషకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీ రజనీ

హిరమండలం: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను కొత్తూరు వ్యవసాయశాఖ ఏడీ బి.రజిని గురువారం తనిఖీ చేపట్టారు. ఎరువులు, పురుగు మందుల సంబంధించిన లైసెన్స్‌లు, రికార్డులు, ఎరువుల నిల్వలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ ఎరువులు అధిక రేట్లుకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు ఎరువులు కొనుగోలుచేసేటప్పుడు బిల్లు ఇవ్వాలని సూచించారు. వ్యవసాయాధికారులు బి.సంధ్య, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాడి పశువులకు టీకాలు

ఆమదాలవలస: పాడి పరిశ్రమ లాభసాటిగా ఉండాలంటే (లంపీ స్కిన్ వ్యాధి/ముద్ద చర్మ వ్యాధి) రాకుండా ముందస్తు వ్యాధి నిరోధక టీకాలు ప్రతీ పశువుకు పాడిరైతులు వేయించుకోవాలని పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఆర్.ఆనందరావు సూచించారు. పట్టణంలోని హడ్కో కాలనీ, మెట్టక్కివలస గ్రామాల్లో పాడి పశువులకు గురువారం టీకాలు వేశారు. ఇప్పటివరకు మునిసిపాలిటీ పరిధిలో ఉన్న 18 వార్డులలో సుమారు 1,858 పశువులకు టీకాలు వేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ టీకాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి అపూర్వ స్పందన

నరసన్నపేట: ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మేజరు పంచాయతీ నరసన్నపేటలోని బొడ్డవలస, పప్పులవీధి, చిత్తిరి వీధి, వజ్రంపేటల్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్నాలు పేరిట సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేయడం జరుగుతుందన్నారు. నాడు–నేడు ద్వారా స్కూళ్లు, ఆస్పత్రులు అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రజలందరి సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ఏపీ నంబర్ వన్ అన్నారు. ఇటువంటి సీఎం మరింత కాలం కొనసాగితే మరిన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతాయన్నారు. నరసన్నపేటలో పొట్నూరు వేణుగోపాలరావు కుటుంబానికి ఏకంగా రూ.11.55 లక్షల మేరకు ఈ నాలుగేళ్లలో ప్రయోజనం కలిగిందన్నారు. ఈ విధంగా ఎన్నో కుటుంబాలకు సంక్షేమ పథకాలు చేరాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ చింతు అన్నపూర్ణ, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, సొసైటీ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు, పార్టీ నాయకులు చింతు రామారావు, కేసీహెచ్‌బీ గుప్త, రాజాపు అప్పన్న, రావాడ మోహన్‌రావు, పాగోటి రాజారావు, కనపల శేఖర్, బొబ్బాది ఈశ్వరరావు, నేతింటి రాజేశ్వరరావు, పట్ట టాగూర్, బీఎల్ శర్మ, పాగోటి అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: గ్రామ స్థాయిలో ఇంటి వద్దకే పరిపాలన తీసుకువచ్చిన నాయకుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని బొర్రంపేటలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలను గురువారం ప్రారంభించారు. గ్రామ స్థాయిలోకి ప్రభుత్వ పరిపాలన తీసుకురావటంతోపాటు ప్రభుత్వ ఉద్యోగులకు సౌకర్యవంతంగా ఉండేందుకు పక్కా భవనాలను నిర్మించారని కొనియాడారు. ఏదైనా పనికావాలంటే మండల కేంద్రానికి, జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని శాఖల ఉద్యోగులు గ్రామ సచివాలయాల్లో అందుబాటులో ఉంటారన్నారు. విత్తనాలు, ఎరువులు, రాయితీ పనిముట్లు కోసం మండల కేంద్రానికి గతంలో రోజుల తరబడి తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. నేడు ఆర్‌బీకేల ద్వారా రైతు వద్దకే వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యోగులు వస్తున్నారన్నారు. గ్రామ వలంటీర్ల నిరంతరం ప్రజల వద్దకు వెళ్లి వారి ఇబ్బందులు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు తగిన ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఐదేళ్ల పాలనలో 600 హామీలు ఇచ్చి ఆరు హామీలు కూడా అమలు చేయలేదన్నారు. మహిళా సంఘాలకు రుణమాఫీ చేస్తామని చెప్పి మోసం చేశారని, ఇంటికో ఉద్యోగం ఇస్తామని, నిరుద్యోగ బృతి ఇస్తామని చెప్పి నిరుద్యోగులకు మోసం చేశారన్నారు. ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, బొర్రంపేట సర్పంచ్ బొడ్డేపల్లి రమణమ్మ, ఎంపీటీసీ కింతలి చిరంజీవి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, పార్టీ నాయకులు ఈగల చిన్నారావు, తొత్తడి మురళీకృష్ణ, రెడ్డి సీతారాం, రెడ్డి లక్ష్మణరావు, ఎంపీడీఓ ఆర్.కాళీప్రసాద్, ఈఓపీఆర్డీ శ్యామలాదేవి, ఏఓ పైడి లతశ్రీ, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



పశు ఆరోగ్య కార్డులను సిబ్బందికి అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తరువాత రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇవ్వటం జరుగుతోందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నం మండల కేంద్రంలో పశువుల వ్యాక్సిన్లు భద్రపర్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పశుసంవర్ధక శాఖ రూ.7.19 లక్షల ఖర్చుతో నిర్మించిన వాక్ఇన్ కోల్డ్ రూమ్ (శీతల గది)ని గురువారం ప్రారంభించారు. పాడి రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా కేంద్రాల ద్వారా రాయితీపై ఎన్నో ఉపకరణాలు అందిస్తున్నట్లు వివరించారు. పశువుల దాణా పెంచేందుకు ముందుకు వచ్చే రైతులను ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. పాడి రైతులకు గిట్టుబాటు అయ్యేలా పాల ధరను ప్రభుత్వం పెంచిందన్నారు. పాడి రైతులతోపాటు గొర్రెలు, మేకల కాపరులను ఆదుకునేలా అనేక నిర్ణయాలు తీసుకున్నారని గుర్తుచేశారు. తక్కువ ప్రీమియంతో బీమా వర్తింపజేస్తున్నారని వివరించారు. పాడి ఆవులు, గొర్రెలు, మేకలు మరణించిన 15 రోజుల్లో బీమా పరిహారం రైతు బ్యాంకు ఖాతాలకు జమచేస్తున్నట్లు తెలిపారు. పశు ఆరోగ్య కార్డులను సిబ్బంది ద్వారా త్వరలోనే రైతులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాతపట్నం ఎంపీపీ దొర సావిత్రమ్మ, వైస్ ఎంపీపీ సవిరిగాన ప్రదీప్, ఎఎంసీ చైర్మన్ కొండాల అర్జునుడు, పార్టీ నాయకులు బి.నారాయణమూర్తి, ఎస్సీ, ఎస్టీ సెల్ చైర్మన్ అప్పన్న, ఎం.తాతయ్య, సర్పంచ్ శ్రీను, ప్రాంతీయ పశు వైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మంచు కరుణాకర్, పశువైద్య డాక్టర్ అనిల్, డాక్టర్ మౌనిక, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి శ్రీభరణి

నరసన్నపేట: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని నరసన్నపేట కోర్టు ఇన్‌చార్జి సివిల్ జడ్జి శ్రీభరణి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై గురువారం అవగాహన కల్పించారు. విద్యార్థుల రక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలను వివరించారు. మహిళల రక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, అమలు చేస్తున్న చట్టాలను తెలియేశారు. విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలని, బాధ్యతగా చదువుకోవాలని సూచించారు. రాగింగ్ వంటి చర్యలకు పాల్పడవద్దని, మోసకారుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మాయ మాటలు చెప్పి ఆడపిల్లలను లోబర్చుకునే వారిపట్ల కఠినంగా ఉండాలని, అవసరమైతే దిశ యాప్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. నరసన్నపేట కోర్టు ఏపీపీ గొండు సత్యనారాయణ, కోటబొమ్మాళి న్యాయవాది నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

బూర్జ: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు ఐ.పావని, జి.రాజశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో గల పీహెచ్‌సీలో గురువారం హెల్త్ సిబ్బంది, సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలతో నెలవారీ సమావేశంలో భాగంగా రివ్యూ నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ పారిశుద్ధ్యంపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలు అందించాలన్నారు. చిన్నారులకు ఇమ్యునైజేషన్ పూర్తిచేయాలన్నారు. సీహెచ్ఓ కె.అప్పలస్వామి, సూపర్‌వైజర్లు లఖినాన సరోజిని, తేజారావు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

• శ్రావణ శోభ



కాలేజీ రోడ్డులో పూజాసామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు



రద్దీగా ఉన్న కాలేజీ రోడ్డు



మెయిన్ రోడ్డులో కొనుగోలుదారులు

నరసన్నపేట మార్కెట్ గురువారం కొనుగోలుదారులతో కిటకిటలాడింది. శుక్రవారం శ్రావణ పౌర్ణమి కావడంతో పూజాసామగ్రి కొనుగోలు చేసేందుకు మహిళలు బజారుకు తరలివచ్చారు. బజారుతోపాటు కాలేజీ రోడ్డు, మెయిన్ రోడ్డు కిటకిటలాడదంది. పండ్లు, పూలుకు మంచి గిరాకీ లభించింది. అరటి పండ్లు డజన్ రూ.వంద వరకు విక్రయించారు. మిగిలిన పండ్ల ధరలు కూడా అధికంగానే ఉన్నాయి.

– నరసన్నపేట

• విజయోత్సవం

చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతమైన నేపథ్యంలో పలుచోట్ల విద్యార్థులు గురువారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. జయహో భారత్, జయహో ఇస్రో అని నినాదాలు చేస్తూ చంద్రయాన్–3 ప్రయోగ విశిష్టతను వివరించారు. దేశ కీర్తిప్రతిష్టలను ప్రపంచ నలుమూలలకు చాటిచెప్పిన ఇస్రో శాస్త్రవేత్తలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. మరికొన్నిచోట్ల చంద్రయాన్–3 మిషన్ నమూనా ఆకారంలో ఉండి, మానవహారం చేపట్టి సందడి చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ఆమదాలవలస రూరల్: గేదెల హరికృష్ణ రూపొందించిన సైకత శిల్పం



సారవకోట: వంద అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న నవతేజ పాఠశాల విద్యార్థులు



నరసన్నపేట: ర్యాలీ నిర్వహిస్తున్న గీతాంజలి స్కూల్ విద్యార్థులు



ఆమదాలవలస: రైల్వే స్టేషన్ ఆవరణలో జెండా వందన సమర్పణ చేస్తున్న వివిధ వర్తక సంఘాల నాయకులు, విద్యార్థులు



పొందూరు: తాడివలస ఉన్నత పాఠశాలలో మొక్కలు పట్టుకుని వినూత్నంగా అభినందనలు తెలుపుతున్న విద్యార్థులు



పాతపట్నం: జయహో ఇస్రో ఆకారంలో పాతపట్నం మోడల్ స్కూల్ విద్యార్థులు

ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న గ్రామస్తులు

నరసన్నపేట: మండలంలోని రెడ్డికిపేట స్కూల్లో పనిచేస్తూ ఉద్యోగోన్నతి, బదిలీపైన వెళ్లిన ఉపాధ్యాయులు బి.మోహనరావు, టి.అనిల్ కుమార్‌లను గ్రామస్తులు గురువారం సత్కరించారు. బాధ్యతగా పనిచేసే ఉపాధ్యాయులకు ఎల్లప్పుడూ ఆదరణ ఉంటుందని ఎంఈఓ శాంతారావు అన్నారు. స్కూల్ అభివృద్ధికి దాతలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పట్నాన షన్ముఖరెడ్డి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సహాయసహకారాలు అందిస్తామన్నారు. సీఆర్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

• మట్టి తరలింపు అడ్డగింత



చెరువు గట్టును తవ్వుతున్న దృశ్యం

సారవకోట: మండలంలోని అంగూరు గ్రామంలో గల కొత్త చెరువులో అక్రమంగా మట్టి, కంకర తవ్వకాలు జరగడంతో అధికారులు గురువారం అడ్డుకున్నారు. జాతీయ రహదారికి ఆనుకుని అంగూరు గ్రామానికి సమీపంలో ఉన్న ఈ కొత్త చెరువులో జేసీబీలతో తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. ఇటీవల ఉపాధి హామీ పనులతో వేసిన గట్టును తవ్వడంతో ఆయకట్టు రైతులు తహసీల్దార్ హనుమంతరావుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్ఐ బేగంను తవ్వకాలు జరుగుతున్న చెరువును పరిశీలించాలని సూచించారు. ఆమె స్థానిక పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి, సచివాలయ సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలించి తవ్వకాలు నిలుపుదల చేయించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

మెళియాపుట్టి: ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంఈఓ–2 పద్మనాభం అన్నారు. మండలంలోని కొత్తమారేడుకోట ఎంపీయూపీ పాఠశాలను గురువారం సందర్శించారు. గణితంలో మెలకువలను తెలియజేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న గోరు ముద్ద ద్వారా పోషక విలువలు కలిగిన భోజనాన్ని అందిస్తుందన్నారు.

26న జిల్లాకు గరీబ్ గైడ్ కమిటీ రాక

జలుమూరు: ఈ నెల 26వ తేదీన జిల్లాకు గరీబ్ గైడ్ కమిటీ సభ్యులు పర్యటించనున్నారని సుప్రీంకోర్టు న్యాయవాది డి.వి.రావు గురువారం తెలిపారు. కోర్టు ధిక్కరణ కేసులు.. జలుమూరు మండలం చిన్నదూగాం పంచాయతీ పరిధి కాకర్ల చెరువు, నరసన్నపేట మండలం రాజుల చెరువు తదితర కేసులు తుది దశకు చేరుకోవడంతో కోర్టుకు వాస్తవాలు తెలియచేసేందుకు గరీబ్ గైడ్ కమిటీ ఐదుగురిని నియమించిందన్నారు. ఈ కమిటీకి అధ్యక్షుడిగా తనను (డి.వి.రావు) ఎన్నుకుందన్నారు. జిల్లాలో ప్రభుత్వ స్థలాలు, చెరువుల ఆక్రమణలు తమ దృష్టికి తేవాలనుకుంటున్నవారు, ఉచిత న్యాయ సహాయం కావాలనుకుంటున్నవారు ఈ నెల 26న మధ్యాహ్నం మూడు నుంచి ఐదు వరకు ఫోన్ 9618536666, 91804 56789 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పాతపట్నంలో 'క్యాంపస్ కాప్'



క్యాంపస్ కాప్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

పాతపట్నం: జిల్లా ఎస్పీ జీఆర్ రాధిక ఆదేశాల మేరకు గురువారం పాతపట్నం పోలీస్ స్టేషన్‌లో క్యాంపస్ కాప్ కార్యక్రమం నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. రెండో రోజు జరిగిన ఈ కార్యక్రమంలో పాతపట్నం మండల కేంద్రంలోని మహేంద్ర, కిరణ్మయి, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. మహిళల భద్రత, ఈవ్‌టీజింగ్, మహిళా చట్టాలు, దిశా యాప్‌పై మెళియాపుట్టి ఎస్సై టి.రాజేష్ అవగాహన కల్పించారు.